E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు   జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD   సంపుటి :01   సంచిక :194   మంగళవారం 23-06-2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 04   వెల :05/-

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

### 6 రోజుల పాటు దంచికొట్టనున్న వానలు!



2 లో

## 'ఏడు జన్మలెత్తినా ఏం చేయలేవు'

### డిప్యూటీ సీఎం పవన్‌పై మాజీమంత్రి అంబటి ఫైర్

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు ప్రతి విషయంలోనూ పవన్ ప్రజలను, బాధితులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వం సాయికృష్ణ కుటుంబాన్ని పిలిపించి న్యాయం చేస్తామని చెబుతుంటే.. మరోవైపు పవన్ కళ్యాణ్ ఏమో సాయికృష్ణను ఒక క్రిమినల్ అని మాట్లాడుతున్నారని అన్నారు.దే సమయంలో జనసేన నేత సామినేని ఉదయభాను సాయికృష్ణ తల్లిని ఓదార్చేందుకు వెళ్లి.. పవన్ కళ్యాణ్ పంపిస్తేనే వచ్చామని చెబుతున్నారు. అసలు పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే తెలియాలి అని అన్నారు. వైసిపి నేతలను తాటతీస్తామంటూ పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై అంబటి మండిపడ్డారు.



2 లో

# రైతులకు తీపికబురు

## ఒకే విడతలో 'రైతు భరోసా' పంపిణీ



- ఒకేసారి రైతు భరోసా
- జూన్ 30న నిధుల విడుదల
- రూ.9 వేల కోట్ల జమ
- 73 లక్షల రైతులకు లబ్ధి
- ఒకే విడతలో చెల్లింపులు
- సన్న రైతులకే ప్రాధాన్యం
- ఏడున్నర ఎకరాలకే పరిమితి?
- సాగు రైతులకే సాయం
- శాటిలైట్ సర్వేతో ఎంపిక
- పట్టాదారులకు కొత్త నిబంధనలు
- కౌలు రైతులపైనా దృష్టి
- ఖరీఫ్‌కే భరోసా?
- పంట ఆధారంగానే చెల్లింపు
- రైతులకు పెట్టుబడి ఊరట
- వ్యవసాయ శాఖ భారీ ప్రణాళిక

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** ప్రభుత్వానికి ఆర్థిక భారమైనా రైతులకు భరోసా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 30న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరగనున్న బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభంకావడంతో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కొత్త పట్టా పాసు బుక్ వివరాలను సీసీఎల్‌ఏ నుంచి ప్రభుత్వం తెప్పించుకుంది. మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాలో రూ.9 వేల కోట్లు జమ చేసేందుకు పక్కాగా ప్లాన్‌చేస్తోంది. యాసంగిలో రెండు ఎకరాలకే పెట్టుబడి సాయం అందించడంతో రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో దాని నుంచి బయటపడేందుకు ఒకేసారి జమ చేస్తే బాగుంటుందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. ఇక నిధుల కొరత ఏర్పడితే మొదట ఎకరం చొప్పున 9 రోజుల్లో పూర్తిగా పంపిణీ చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖలో టాక్ వినిపిస్తోంది.

మిగతాది 2 లో..

## అల్లు అర్జున్ గైర్హాజరు.. కోర్టు కీలక సూచనలు.!




2 లో

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. అయితే వ్యక్తిగత కారణాల వల్ల నటుడు అల్లు అర్జున్ కోర్టుకు హాజరు కాలేకపోయారని ఆయన తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. దీంతో ఆయన గైర్హాజరుకు సంబంధించి మెమో దాఖలు చేయాలని కోర్టు సూచించగా, అల్లు అర్జున్ తరఫు న్యాయవాది అబ్సెంట్ పిటిషన్‌ను సమర్పించారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్‌ది సుతిలేని సంసారం

### ఎంపీ రఘునందర్ రావు హాట్ సెటైర్లు



2 లో

## ఘోర రోడ్డు ప్రమాదం

### డిటీఓ పైకి దూసుకెళ్లిన బొగ్గు టిప్పర్.!




2 లో

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. పరకాల–భూపాలపల్లి జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి (డిటీఓ) వెంకన్నను బొగ్గు టిప్పర్ లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా రోడ్డు రవాణా శాఖ కార్యాలయం ఎదుట వెంకన్న తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## టీ కాంగ్రెస్‌లో కీలక పరిణామం..

### పటాన్‌చెరు నుంచి బరిలో జగ్గారెడ్డి?

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయాలు రోజు రోజుకు రంజుగా మారుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండున్నరేళ్లకు పైగా సమయం ఉన్నప్పటికీ పోటీ కోసం నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీనియర్లు రాజకీయం సాగిస్తుంటే తమ వారసుల కోసం రూట్ క్లియర్ చేసే పనిలో మరికొంత మంది బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ఆసక్తిని రేపుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సరికొత్త వ్యూహంతో బరిలోకి దిగేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.




2 లో

పటాన్‌చెరు నుంచి బరిలోకి?:

తెలంగాణ కాంగ్రెస్‌లో ఫైర్ బ్రాండ్‌గా పేరున్న జగ్గారెడ్డి గత కొంత కాలంగా చేస్తున్న రాజకీయం సంగారెడ్డి జిల్లాలోనే కాకుండా తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాశంగా మారుతోంది. తన సొంత గడ్డ సంగారెడ్డి నియోజకవర్గాన్ని వదిలి ఈసారి పటాన్‌చెరు అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## నీట్ రీ ఎగ్జామ్‌లో మళ్లీ దగా

### బీహార్‌లో 'సాల్వర్ గ్యాంగ్' గుట్టురట్టు..



2 లో

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ వైద్య విద్యా ప్రవేశ పరీక్షల వివాదాలు సమిసిపోయి.. మళ్లీ పరీక్ష నిర్వహించింది ఎన్టీఏ. అయితే దురదృష్టవశాత్తు ఈ రీ ఎగ్జామ్‌లోనూ అక్రమార్కులు తమ పంథా మార్చుకోలేదు. బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద నిర్వహించిన పకడ్బందీ తనిఖీల్లో భారీ కుంభకోణం వెలుగుచూసింది.

# రైతులకు తీపికబురు..ఒకే విడతలో 'రైతు భరోసా' పంపిణీ

మొదటి పేజీ తరువాయి

ఏడున్నర ఎకరాలకే..

మరోవైపు యాసంగి సీజన్‌లో భరోసా తమే సాగు అవుతాయి. అయితే వరి తర్వాత పెద్ద మొత్తంలో సాగు చేసే పంట పత్తి. ఇది వానాకాలంలోనే వేయగా జనవరి వరకు పూర్తవుతుంది. రెండోసారి రబీలో సాగు చేయరు. అలాంటప్పుడు పత్తికి పెట్టుబడిసాయం ఎందుకని ప్రభుత్వ పెద్దలు సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది. దీంతో రైతు భరోసా ఒక ఖరీఫ్‌సీజన్‌కే పంపిణీ చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖలో ప్రచారం జరుగుతోంది. ధనవంతులైన రైతులకు కూడా భరోసా ఇస్తే ప్రభుత్వానికి ప్రయోజనం లేదని, సన్న, చిన్న కారు రైతులకే వేయాలనే అంచనాకు వచ్చినట్టు సమాచారం. వచ్చే వానాకాలం 7.20 గుంటల వరకు పరిమితి పెట్టి ఆ లోపు భూమి కలిగిన వారికే భరోసా సాయం అందజేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాల భూమి ఉంటే అందులో 20 నుంచి 25 లక్షల ఎకరాల భూమి రియల్ ఎస్టేట్, కాలువలు, కుంటలు, బీడు భూములు, సాగుకు పనికిరాని పడావు భూములున్నాయి. వీటిని భరోసా జాబితా నుంచి ప్రభుత్వం ఇప్పటికే తొలగించనుంది.

ఒకే పంటకు సాయం

రైతు భరోసా నిధులు సాగు చేసే రైతులకే పంపిణీ చేయాలని లక్ష్యంగా రేవంత్‌ప్రభుత్వం ప్లాన్‌చేస్తోంది. గత బీఆర్ఎస్‌ప్రభుత్వం సాగు అంటే తెలియని పట్టాదారు పాస్ బుక్ కలిగినవారందరికీ అప్పన్నంగా పెట్టుబడి సాయం ఖాతాలో జమ చేసింది. అయితే ఇకనుంచి ప్రజల సొమ్ము వృథా కాకుండా పంట సాగుచేసే వారికే భరోసా సాయం అందించాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. అవసరమైతే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15 వేలు పంపిణీ చేస్తే పార్టీకి, ప్రభుత్వానికి తిరుగు ఉండదని, స్థానిక ఎన్నికల్లో విజయం సాధించవచ్చనే అంశం ఇటీవల జరిగిన మంత్రి వర్గం సమావేశంలో చర్చకు వచ్చినట్టు సమాచారం. 10 ఎకరాలకుపైగా భూమి ఉన్నవారికి పెట్టుబడి సాయం అందిస్తే ఎలాంటి ఉపయోగం లేదని, పేద, మధ్యతరగతి రైతులకు వేస్తే అన్ని రకాలుగా ప్రయోజనం ఉంటుందని డిస్కస్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. అదే విధంగా కౌలు రైతులను ఆదుకునేందుకు చట్టం తీసుకొచ్చి, వారికి భరోసా ఇచ్చే అంశంపై పరిశీలనచేయాలని ఒకరిద్దరు మంత్రులు ముఖ్యమంత్రి ముందు ప్రపోజల్ పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.



శాటిలైట్ సర్వేనే కీలకం

ఇటీవల వ్యవసాయ విశ్వవిద్యాలయం శాటిలైట్ చిత్రాల ఆధారంగా ప్రతి గ్రామంలో సర్వే నెంబర్ వారీగా పంట విస్తీర్ణం లెక్కించేందుకు స్విట్జర్లాండ్ దేశానికి చెందిన సార్ మ్యాప్ సంస్థతో ఒప్పందం చేసుకుని, రాష్ట్రవ్యాప్తంగా పంటల సాగు వివరాలను సేకరించింది. 95 శాతం ఎలాంటి పంటలు వేశారో గుర్తించింది. శాటిలైట్ సర్వే చేసిన వివరాలను పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాకు ఐదు గ్రామాలను ఎంపికచేసి ఏఈవోలతో సర్వే చేయించగా ఒకే విధంగా వచ్చింది. దీంతో ఇకనుంచి శాటిలైట్ సర్వే ఆధారంగానే పెట్టుబడి సాయం అందించనుంది. ఈ సర్వే ద్వారా ప్రకృతి విపత్తులకు నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం అందజేయవచ్చు. సాగు చేసిన భూముల ఆధారంగా విత్తనాలు, ఎరువులు ఎంత కావాలో ముందుస్తుగా సిద్ధం చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం పంట సాగు చేసిన రైతులకే అందుతుందని ప్రభుత్వం బలంగా భావిస్తోంది.

# అల్లు అర్జున్ గైర్హాజరు.. కోర్టు కీలక సూచనలు.!




సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. అయితే వ్యక్తిగత కారణాల వల్ల నటుడు అల్లు అర్జున్ కోర్టుకు హాజరు కాలేకపోయారని ఆయన తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. దీంతో ఆయన గైర్హాజరుకు సంబంధించి మెమో దాఖలు చేయాలని కోర్టు సూచించగా, అల్లు అర్జున్ తరపు న్యాయవాది అబ్సెంట్ పిటిషన్‌ను సమర్పించారు.

ఈ సందర్భంగా అల్లు అర్జున్‌ను వర్చువల్‌గా విచారణకు హాజరయ్యేలా అనుమతించాలా లేదా అన్న అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని సంధ్య థియేటర్ తరపు న్యాయవాది భాను చందర్ వెల్లడించారు. కేసులోని ఇతర నిందితులు సహా మొత్తం 21 మంది కోర్టుకు హాజరైనట్లు తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను జూలై 6వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఏ11 నిందితుడిగా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. ఆయన వ్యక్తిగత హాజరు కోసం కోర్టు సమన్లు జారీ చేసినప్పటికీ.. హాజరు కాలేకపోవడానికి గల కారణాలను ఆయన న్యాయవాది కోర్టుకు వివరించారు.

మరోవైపు ఏ1 నుంచి ఏ10 వరకు నిందితులుగా సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని చేర్చిన పోలీసులు మొత్తం 23 మందిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఇప్పటికే 19 మంది నిందితులకు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. 2024 డిసెంబర్ 4న 'పుష్ప-2' బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్ లోని సంధ్య థియేటర్ వద్ద భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ ఘటనలో దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు 23 మందిని నిందితులుగా పేర్కొంటూ కోర్టుకు ఛార్జ్‌షీట్ సమర్పించారు.

# 'ఏడు జన్మలెత్తినా ఏం చేయలేవు'.. డిప్యూటీ సీఎం పవన్‌పై మాజీమంత్రి అంబటి ఫైర్

మొదటి పేజీ తరువాయి



"రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇలా మాట్లాడొచ్చా? మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా? అసలు ఎవరు గూండాలు? పవన్ గారూ.. మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరు" అని స్పష్టం చేశారు. "నేను హోంమంత్రిగా లేకపోవడం మీ అదృష్టం" అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని అంబటి ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని పేర్కొన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్‌ను కూడా చట్టప్రకారమే శిక్షించారని గుర్తు చేశారు. సాయికృష్ణ కేసులో ఒక అధికారి విచారణ జరుపుతుండగా హఠాత్తుగా 'సిట్' వేయడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకనే ఈ నాటకాలు ఆడుతున్నారని, ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐ లేదా ఎన్ఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని అంబటి రాంబాబు దుయ్యబట్టారు. ఒకవైపు సాయికృష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూ.. మరోవైపు ఈ కేసులో నిందితుడైన సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దని ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నీట్ రీ ఎగ్జామ్‌లో మళ్లీ దగా

## బీహార్‌లో 'సాల్వర్ గ్యాంగ్' గుట్టురట్టు..

## 9 మంది నకిలీ అభ్యర్థులతో సహా 30 మంది అరెస్ట్



**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ వైద్య విద్యా ప్రవేశ పరీక్షల వివాదాలు సమిసిపోయి.. మళ్లీ పరీక్ష నిర్వహించింది ఎన్టీఏ. అయితే దురదృష్టవశాత్తు ఈ రీ ఎగ్జామ్‌లోనూ అక్రమార్కులు తమ పంథా మార్చుకోలేదు. బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద నిర్వహించిన పకడ్బందీ తనిఖీల్లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. అసలైన విద్యార్థులకు బదులుగా పరీక్షలు రాసేందుకు రంగంలోకి దిగిన 'సాల్వర్ గ్యాంగ్' (నకిలీ అభ్యర్థుల ముఠా) నెట్‌వర్క్‌ను జిల్లా యంత్రాంగం, పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. వివిధ పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్, ఐడెంటిటీ వెరిఫికేషన్ సమయంలో దొరికిపోయిన 9 మంది నకిలీ అభ్యర్థులు సహా ఈ మోసంతో సంబంధం ఉన్న మొత్తం 30 మందిని అధికారులు శనివారం అరెస్ట్ చేశారు.

లఖిసరాయ్ జిల్లాలోని వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో పక్కా సమాచారంతో అధికారులు ఏకకాలంలో ఈ తనిఖీలు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. కేఆర్కే హైస్కూల్ పరీక్షా కేంద్రం నుంచి ఒకరు, కేంద్రీయ విద్యాలయ కేంద్రం నుంచి అత్యధికంగా ఏడుగురు, అలాగే హసన్‌పూర్ స్కూల్ పరీక్షా కేంద్రం నుంచి మరొక నకిలీ అభ్యర్థిని అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్ట్ అయిన ఈ తొమ్మిది మంది నిందితులు బీహార్‌లోని విభిన్న జిల్లాలకు చెందిన వారని, అసలు అభ్యర్థుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని, వారి స్థానంలో పరీక్ష రాయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

కేవలం పరీక్ష రాస్తున్న వారినే కాకుండా, కేంద్రాల వెలుపల ఉంటూ వారికి సాంకేతిక సాయం అందిస్తున్న, అలాగే అభ్యర్థులను చేరవేస్తున్న ముఠా సభ్యులపై కూడా పోలీసులు ఉక్కుపాదం మోపారు. మాల్‌ప్రాక్టీస్, పరీక్షా మోసాలకు సహకరించిన మొత్తం 21 మందిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని అదుపులోకి తీసుకోగా.. ఈ ముఠా వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ప్రస్తుతం లఖిసరాయ్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ప్రభాకర్ కుమార్, సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ శివం కుమార్‌ల ప్రత్యక్ష పర్యవేక్షణలో నిందితులను రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. "నీట్ పునఃపరీక్షలో అక్రమాలకు పాల్పడుతూ 30 మంది దొరికిపోయారు. అందులో 9 మంది ఒకరి బదులు మరొకరు ఎగ్జామ్ రాస్తుండగా.. 21 మంది వీరికి వ్యూహాత్మకంగా సహకరించినట్లు తేలింది" అని ఎస్డీపీఓ శివం కుమార్ ధృవీకరించారు.

విచారణలో నిందితులు వెల్లడించిన వివరాల ఆధారంగా లఖిసరాయ్ జిల్లా వ్యాప్తంగా, పొరుగు జిల్లాల్లోనూ ప్రత్యేక పోలీసు బృందాలు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నాయి. ఈ ఆపరేషన్‌ను జిల్లా కలెక్టర్ శైలేంద్ర కుమార్, ఎస్పీ ప్రేరణా కుమార్‌లు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. 24 గంటలూ కష్టపడి చదివే విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఈ ముఠా వెనుక కొంతమంది కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు, విద్యాశాఖ అధికారుల హస్తం కూడా ఉండవచ్చని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, పూర్తి నెట్‌వర్క్ వివరాలను త్వరలోనే మీడియాకు అధికారికంగా వెల్లడిస్తామని యంత్రాంగం పేర్కొంది.

# టీ కాంగ్రెస్‌లో కీలక పరిణామం.. పటాన్‌చెరు నుంచి బరిలో జగ్గారెడ్డి?

మొదటి పేజీ తరువాయి




ఇదే విషయమై జగ్గారెడ్డి ఇటీవలే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠాన పెద్దల వద్ద తన మనసులోని మాటను సైతం బయటపెట్టినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

సంగారెడ్డి బరిలో జగ్గారెడ్డి సతీమణి:

1986లో మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన జగ్గారెడ్డి.. 2004, 2009, 2018లో సంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ జగ్గారెడ్డి సంగారెడ్డి నియోజకవర్గం విషయంలో తన మనసు మార్చుకున్నారు. సంగారెడ్డిలో తాను ఎమ్మెల్యేగా జీవితంలో పోటీ చేయనని ఈ ఏడాది ప్రారంభంలో శపథం చేశారు. నాలుగు రోజుల క్రితం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి నేను కాదు నా సతీమణి నిర్మలా జగ్గారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉంటారని ఇందులో ఎలాంటి సందేహం లేదని మరోసారి కుండబద్దలు కొట్టారు. నిర్మల ప్రస్తుతం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆమె జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కూడా సేవలందించారు. అయితే తన సతీమణిని సంగారెడ్డి నుంచి బరిలోకి దింపి తాను పటాన్ చెరుపై దృష్టి సారించే వ్యూహంతో జగ్గారెడ్డి పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

పటాన్‌చెరులో ముక్కోణపు (మూడుముక్కలాట):

జగ్గారెడ్డి పోటీపై ప్రచారం ఇలా జరుగుతుంటే పటాన్‌చెరు రాజకీయంలో ఇప్పటికే మూడుముక్కలాట హైవోల్టేజ్ క్రియేట్ చేస్తోంది. ఇక్కడ హ్యాట్రిక్ విక్టరీతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఉండగా, కాంగ్రెస్ పార్టీలో కాటా శ్రీనివాస్ గౌడ్, నీలం మధు ముదిరాజ్ ఇద్దరు బలమైన ఆశావహులుగా ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరినా కాటా శ్రీనివాస్ వర్గంతో పొసగకపోవడంతో ఆయన తిరిగి బీఆర్ఎస్‌కు వెళ్లిపోయారనే టాక్ ఉంది. ఈ క్రమంలో ప్రచారం జరుగుతున్నట్లుగా జగ్గారెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గంపై నిజంగానే దృష్టి సారించారా? రాబోయే రోజుల్లో జగ్గారెడ్డి వ్యూహం, సమీకరణాలు ఎలాంటి మలుపులు తిరుగబోతున్నాయి అనేది తెలంగాణ కాంగ్రెస్‌లో ఉత్కంఠ రేపుతోంది.

# ఘోర రోడ్డు ప్రమాదం.. డిటీఓ పైకి దూసుకెళ్లిన బొగ్గు టిప్పర్.!

మొదటి పేజీ తరువాయి




ఈ సమయంలో వేగంగా వచ్చిన బొగ్గు టిప్పర్ అదుపుతప్పి అధికారుల వైపు దూసుకెళ్లింది. టిప్పర్ బలంగా ఢీకొనడంతో వెంకన్న అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రతకు ఆయన మృతదేహం నుజ్జునుజ్జయ్యిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. కాగా, వెంకన్న కేవలం 15 రోజుల క్రితమే బదిలీపై భూపాలపల్లి జిల్లాకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. విధి నిర్వహణలో ఉండగానే ఆయన మృతి చెందడం జిల్లా అధికార వర్గాలను, రవాణా శాఖ సిబ్బందిని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపడుతున్నారు.

# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన.. 6 రోజుల పాటు దంచికొట్టనున్న వానలు!

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న ఆరు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ వరకు విస్తరించిన ద్రోణి, రాయలసీమ పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం కారణంగా జూన్ 27 వరకు పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయని తెలిపింది. తెలంగాణలో మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి తదితర జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు సూచించారు.

అటు ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. పిడుగుపాట్లు సంభవించే ప్రమాదం ఉన్నందున వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్స్ సమీపంలో ఉండవద్దని ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. నైరుతి రుతుపవనాల విస్తరణతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాకాలం ప్రారంభమైనట్లు కనిపిస్తోందని, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు తగ్గి ప్రజలకు ఉపశమనం లభించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై ఘోరం.. వారం వ్యవధిలో ఆలయంలో రెండు భారీ స్కామ్‌లు!

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో టికెట్ల గోల్‌మాల్ కలకలం రేపుతోంది. అమ్మవారి ఆదాయానికి గండి కొడుతూ, భక్తులను మోసం చేస్తున్న అక్రమార్కుల గుట్టు ఒక్కొక్కటిగా రట్టవుతోంది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి రెండు పెద్ద ఘటనలు వెలుగుచూడటంతో ఆలయ ఈవో శీనా నాయక్ సీరియస్ అయ్యారు. ఈవో ఫిర్యాదు మేరకు స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.



తాజాగా నిన్న ఆలయంలో టికెట్ల పంచింగ్ దగ్గర పెద్ద మోసం వెలుగుచూసింది. రూ. 100 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు దర్శనానికి వెళ్లే సమయంలో వాటిని పంచింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే, అక్కడ విధుల్లో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చింతాడ సాయి, మరో మహిళా ఉద్యోగి కలిసి సుమారు 70 నుంచి 80 టికెట్లను పంచింగ్ చేయకుండా దాచిపెట్టారు. ఈ టికెట్లను మళ్లీ అమ్ముకుని సొమ్ము చేసుకోవాలనేది వీరి ప్లాన్. దీనిని గమనించిన ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వెంటనే అలర్ట్ అయి, ఆ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తనిఖీ చేయగా పంచింగ్ చేయని టికెట్లు బయటపడ్డాయి. వెంటనే ఈ సమాచారాన్ని ఈవోకు చేరవేయగా.. టెంపుల్ పోలీస్ సిబ్బంది నరసింహారావు, జగదీష్‌లు నిందితులను పట్టుకుని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ఈవో శీనా నాయక్ ఆ ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇలాగే ఈ నెల 14వ తేదీన కూడా ఆలయంలో అనధికార దర్శనాలు చేయిస్తున్న దళారీ గుట్టు రట్టయింది. గతంలో దుర్గమ్మ ఆలయంలో హోంగార్డ్‌గా పనిచేసిన చంద్రశేఖర్ అనే వ్యక్తి.. దళారీగా మారి భక్తులను నిలువునా ముంచాడు. ఏకంగా 50 మంది భక్తుల దగ్గర తలా రూ. 500 చొప్పున మొత్తం రూ. 25,000 వసూలు చేసి అక్రమంగా దర్శనాలు చేయిస్తుండగా ఈవో శీనా నాయక్ స్వయంగా రంగంలోకి దిగి అతడిని పట్టుకున్నారు. ఈవో ఫిర్యాదుతో స్పందించిన సీపీ రాజశేఖర్ బాబు.. హోంగార్డ్ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. గతంలో కూడా అమ్మవారి ఆలయంలో నకిలీ రూ. 500 టికెట్ల వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టించింది. అయితే అప్పట్లో నిందితులపై అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుని వదిలేశారని, ఆ ఉదాసీనత వల్లే ఇప్పుడు సిబ్బంది, దళారీలు యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారని భక్తులు, స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా నిందితులపై కఠిన చర్యలు తీసుకుని ఆలయ పవిత్రతను కాపాడాలని వారు కోరుతున్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్‌ది సుతిలేని సంసారం

## ఎంపీ రఘునందర్ రావు హాట్ సెటైర్లు

**న్యూస్ డెస్క్, 22 జూన్ (తెలుగు గళం):** తాను చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభత్వాన్ని బద్నాం చేసేందుకు కంకణం కట్టుకున్నాడని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. ఇవాళ ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మెట్రో ఫేజ్-1 టేకోవర్‌లో భారీగా అవకతవకలు జరగాయని.. వాటిపై విచారణ జరిపి ఎక్కడ తనపై కేసులు పేడతారేమోనని సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి ఐఆర్ఎఫ్సి రుణం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పూచీకత్తుతోనే వచ్చిందని అన్నారు. అలాంటప్పుడు మెట్రో ఫేజ్-2 పనులకు కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆయన సూటిగా తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన.. సుతి లేసి సంసారంలా ఉందని ఫైర్ అయ్యారు. మంత్రులు, ముఖ్యమంత్రి మాటలను అసలు వినడం లేదని అందుకే రేవంత్ రెడ్డి తీవ్ర ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని రఘునందర్ రావు అన్నారు.

# ఐఐఐటీలో సీటు సాధించిన సంకీర్తనకు ఘన సన్మానం



తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ జూన్ 22

జఫర్‌గడ్ మండలానికి చెందిన విద్యార్థిని బుర్ర సంకీర్తన పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 562 మార్కులు సాధించి మండలంలో సెకండ్ టాపర్‌గా నిలవడంతో పాటు ఐఐఐటి లో సీటు సాధించి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు బుర్ర తిరుపతి గౌడ్ కుమార్తె సంకీర్తనను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) అభినందించి సన్మానించారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జనగామ జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లందుల సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు తౌటి సురేష్ గౌడ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అబ్బరబోయిన యాక స్వామి, బూత్ అధ్యక్షులు సకినాల కొమురెల్లి, నర్సింగోజు స్వామి, వల్లాల శ్రీనివాస్, వార్డు సభ్యులు బైరి పవన్, నేరోళ్ళ రాజు, జిల్లా నారి శక్తి కేంద్ర ఇంచార్జ్ ముస్కు స్వప్న, పాలకుంట కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, సంకీర్తన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు.

# స్టేషన్ ఘన్‌పూర్‌లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం

తెలుగు గళం న్యూస్, స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 22



జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని శివునిపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ వేణు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని అన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని వివరించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించడం లేదా వినియోగించడం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని మంచి మార్గంలో నడిపించాలని సీఐ వేణు సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్టేషన్ ఘనపూర్‌లో భూత్ స్థాయి అధికారులకు ఎస్ఐఆర్‌పై శిక్షణ



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, జూన్ 22

స్టేషన్ ఘనపూర్ మండల పరిధిలోని అన్ని గ్రామాల భూత్ స్థాయి అధికారులు కోసం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్, స్టేషన్ ఘనపూర్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమంపై శిక్షణా తరగతి నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ రాజేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన విధులు, సమాచార సేకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం భూత్ స్థాయి అధికారులకు అవసరమైన మెటీరియల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో ఎస్. కిరణ్ ప్రకాష్, తహసీల్దార్ స్వప్న, మండల గిర్దావర్లు శ్రీకాంత్, సతీష్, గ్రామ జీపీఓలు మరియు ఇతర అధికారులు హాజరయ్యారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి భూత్ స్థాయి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అధికారులు సూచించారు.

# ప్రభుత్వ పాఠశాలలను రక్షించాలి -- ప్రైవేట్ ఫీజుల దోపిడిని అరికట్టాలి- రాపర్తి రాజు

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 22 (తెలుగు గళం)


ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రోత్సాహం ఇవ్వడం వల్ల సాధారణ, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, వివిధ పేర్లతో అదనపు వసూళ్లు పెరిగిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను ప్రభుత్వం అరికట్టి, ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు మౌలిక వసతులను మెరుగుపరచి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పేద, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిరక్షణ కోసం ప్రజలు, తల్లిదండ్రులు ముందుకు రావాలని పిలుపునిచ్చిన ఆయన, ఈ రోజు నుంచి వారం రోజుల పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, అధిక ఫీజులపై సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేట్ యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని వెల్లడించారు. సీపీఎం చేపట్టిన ఈ సర్వేకు ప్రజలు మద్దతు తెలుపుతూ భాగస్వాములు కావాలని




కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, మండల కమిటీ సభ్యులు కత్తుల రాజు, మంద మహేందర్, చిలుముల్ల భాస్కర్, పోలాస్ పరమేష్, నాయకులు వంగపండ్ల సోమయ్య, ద్రైద కుమార్, నీరటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# జఫర్‌గడ్ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్, జూన్ 22



జనగామ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పండుగ హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జఫర్‌గడ్ మండల ఉపసర్పంచ్‌ల సమావేశం నిర్వహించి, మండల ఉపసర్పంచ్‌ల ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా కార్యదర్శిగా కోత్వాల కుమార్‌ను ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా పెండ్లి యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా యాట మధు, కోశాధికారిగా కొత్త వీరస్వామి తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పండుగ హరీష్ ముదిరాజ్ మాట్లాడుతూ ఉపసర్పంచ్‌లు ఐక్యంగా ఉంటూ తమ హక్కుల సాధనతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఉపసర్పంచ్‌ల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, స్థానిక సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచ్‌లు పాల్గొని నూతన కమిటీని అభినందించారు.

# మాజీ ఎంపీటీసీ ఎల్లగౌడ్ అంతిమయాత్రలో పీఏసీఎస్ చైర్మన్ మనోజ్ గౌడ్

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 22



సోమారం గ్రామ మాజీ ఎంపీటీసీ, సీనియర్ నాయకుడు వడ్లకొండ ఎల్లగౌడ్ అంతిమయాత్రలో పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్ పాల్గొన్నారు.

పర్వతగిరి మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎల్లగౌడ్, ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. సోమారం గ్రామంలో జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్న చైర్మన్ మనోజ్ గౌడ్, ఎల్లగౌడ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్‌లు రాపాక నాగయ్య, బానోతు వెంకన్న, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిలి బాబు, భాస్కర్, కుమార్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# దాట్ల కొమురమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

## హాజరై శ్రద్ధాంజలి ఘటించిన భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రభుత్వ ప్లీడర్ బోట్ల సుధాకర్,న్యాయవాదులు

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని రేగొండ మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన ప్రముఖులు దాట్ల విజయ్ (అలియాస్ ఐలయ్య) మాతృమూర్తి దాట్ల కొమురమ్మ ఇటీవల కాలం చేసిన సంగతి విదితమే. సోమవారం పెద్దంపల్లి గ్రామ నివాసంలో మృతురాలి పదకొండవ రోజు (దశదిన కర్మ) కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ),సీనియర్ అడ్వకేట్ బోట్ల సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ఆయన కొమురమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు సద్గతులు కలగాలని ప్రార్థిస్తూ, నిరుపేద కుటుంబం నుండి వచ్చి సమాజంలో ఎదిగిన ఆమె జీవితాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అనంతరం బోట్ల సుధాకర్ మాతృవియోగంతో తీవ్ర పుత్రశోకంలో ఉన్న దాట్ల విజయ్ (ఐలయ్య)ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. కొమురమ్మ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వ ప్లీడర్ బోట్ల సుధాకర్‌తో పాటు ఈ శ్రద్ధాంజలి ఘటించిన వారిలో జిల్లా కోర్టుకు చెందిన ప్రముఖ న్యాయవాదులు (అడ్వకేట్లు) దుప్పటి ప్రవీణ్, మల్యాల సాంబయ్య, అల్లె నాగరాజు యాదవ్, బొజ్జపెల్లి రాజేందర్, కోడెపాక ప్రభాకర్, మడికొండ సాంబయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారంతా మృతురాలి కుటుంబానికి ధైర్యం



చెప్పారు. ఈ దశదిన కర్మ కార్యక్రమానికి పెద్దంపల్లి గ్రామ సర్పంచ్,మాజీ ప్రజాప్రతినిధులు,వివిధ పార్టీల నాయకులు,గ్రామ ప్రముఖులు,బంధుమిత్రులు భారీగా తరలివచ్చి కొమురమ్మకు తమ అశ్రునయనాలతో అంతిమ శ్రద్ధాంజలి ఘటించారు.

# కొత్తపెల్లి గోరి మండలం జగ్గయ్యపేట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

## అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన బైక్;బీహార్‌కు చెందిన యువకుడు (21) అక్కడికక్కడే దుర్మరణం,మరొకరికి తీవ్ర గాయాలు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి

కొత్తపల్లి గోరి మండలం పరిధిలో సోమవారం తెల్లవారుజామున ఒక ఘోర రహదారి ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టిన సంఘటనలో ఓ వలస యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు మృత్యువుతో పోరాడుతున్నారు. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు ఒకే మోటార్ సైకిల్‌పై గోరి కొత్త మండలం నుండి రేగొండ వైపునకు ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో వారి వాహనం జగ్గయ్యపేట గ్రామ శివారులోకి చేరుకోగానే, అక్కడ ఉన్న ఒక ప్రమాదకరమైన మూలమలుపు వద్ద బైక్ ఒక్కసారిగా అదుపుతప్పింది. తెల్లవారుజామున వెలుతురు సరిగ్గా లేకపోవడం లేదా అతివేగం కారణంగా బైక్ నడుపుతున్న వ్యక్తి వాహనాన్ని నియంత్రించలేకపోవడంతో, అది రోడ్డు పక్కనే ఉన్న పెద్ద చెట్టును అతి బలంగా ఢీకొట్టింది. ఈ భీకర ప్రమాద దాటికి బైక్ ముందు భాగం పూర్తిగా ధ్వంసమవగా, బైక్‌పై ప్రయాణిస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన రాహుల్ కుమార్ (21) అనే యువకుడి తలకు, శరీర భాగాలకు తీవ్రమైన రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మోటార్ సైకిల్‌పై ఉన్న మరో వ్యక్తికి కూడా రెండు కాళ్లు, చేతులు విరిగి తీవ్రమైన అంతర్గత గాయాలయ్యాయి. తెల్లవారుజామున వెళ్తున్న బాటసారులు ప్రమాదాన్ని గమనించి తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే గోరి కొత్తపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడి,రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో ఉన్న మరో యువకుడిని తక్షణమే 108 అంబులెన్స్ ద్వారా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, మృతుడు,గాయపడిన వ్యక్తి బతుకుదెరువు కోసం బీహార్ రాష్ట్రం నుండి ఇక్కడికి వలస వచ్చిన కూలీలుగా పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పోలీసులు రాహుల్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ ఘోర ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసుకొని,మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి దర్యాప్తు జరుపుతున్నారు.

# బండారుపల్లిలో ఘనంగా భూక్య నందిని -దేవ్ సింగ్ నూతన గృహప్రవేశం

## హాజరై ఆశీర్వదించిన లంబాడీల ఐక్యవేదిక నేతలు,బంధుమిత్రులు



తెలుగు గళం న్యూస్ ములుగు

ములుగు జిల్లా పరిధిలోని బండారుపల్లి గ్రామంలో సోమవారం ఒకే వేదికపై మూడు శుభకార్యక్రమాలు అత్యంత అంగరంగ వైభవంగా, వేడుకగా జరిగాయి. గ్రామానికి చెందిన ప్రముఖులు భూక్య నందిని-దేవ్ సింగ్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ మహోత్సవంతో పాటు, వారి పుత్రిక పుష్పలకరణ (పుష్పాలంకరణ) వేడుక, అలాగే పుత్రుడు చిరంజీవి శ్రీ సాయి వర్షిత్‌కు సాంప్రదాయబద్ధంగా దోతీ కట్టించే కార్యక్రమాలను కుటుంబ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా సాగిన ఈ త్రివిధ శుభకార్యక్రమాలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి బంధుమిత్రులు, గిరిజన సంఘాల ప్రముఖులు, రాజకీయ, సామాజిక నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ వేడుకల్లో లంబాడీల ఐక్యవేదిక (లైవ్) ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, ప్రముఖ గిరిజన నేతలు సుజాత పరశురాం నాయక్, లావుడియా సరిత గణపతి నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు నూతన గృహంలోకి అడుగుపెట్టిన భూక్య నందిని-దేవ్ సింగ్ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పుష్పాలంకరణ వేడుక జరుపుకున్న కుమార్తెను, దోతీ కట్టించుకున్న కుమారుడు శ్రీ సాయి వర్షిత్‌లను ప్రత్యేకంగా ఆశీర్వదించి, వారికి ఉజ్వలమైన భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో పృథ్వి, సురేష్, పోరిక సునీల్, భూక్య విజయ భద్రునాయక్, లావణ్య చరణ్ సింగ్, భూక్య తారాబాయి, అజ్మీర వీరమ్మ మోతిలాల్, సజన్ నాయక్, సందీప్ కుమార్, వేణు, దీపిక రాజేష్, శిరీష రాందాస్, వినోద్, వేణు, ధరం సింగ్, కైక భాయ్, రాజన్న, రాహుల్ సింగ్ తదితర ప్రముఖులు, లంబాడీ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గిరిజన నారీమణులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన అతిథులందరికీ గృహ యజమానులు భూక్య నందిని-దేవ్ సింగ్ కుటుంబ సభ్యులు ఘనంగా మర్యాదలు చేసి, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణాన్ని తలపించిన ఈ శుభకార్యక్రమం విజయవంతం కావడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, తరలివచ్చి దీవించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# డీటీఓ వెంకన్న కుటుంబానికి రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా,ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి

## :డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్

## విధి నిర్వహణలో అధికారి మృతిపై తీవ్ర సంతాపం

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి




జయశంకర్ భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం అత్యంత విషాదకరమని డెమొక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సోమవారం ఉదయం ఆర్టీఓ కార్యాలయం ముందు నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు చేపడుతున్న సమయంలో, తాడిచర్ల నుండి అతివేగంగా, బేఖాతరుగా వచ్చిన బొగ్గు టిప్పర్ లారీ ఢీకొనడంతో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్య నవీన్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, విధి నిర్వహణలో ఉండగానే ఒక ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారి ఈ రకంగా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం రాష్ట్రంలో మరియు జిల్లాలో నెలకొన్న రహదారి భద్రతా పరిస్థితులకు, మితిమీరిన టిప్పర్ల వేగానికి అద్దం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం నెల రోజుల క్రితమే జగిత్యాల నుండి భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వచ్చి,ఎంతో బాధ్యతగా పనిచేస్తున్న వెంకన్న ఇలా అకాల మరణం చెందడం వారి కుటుంబానికి ఎప్పటికీ పూడ్చలేని తీరని లోటని పేర్కొన్నారు. ఈ ఘోర దుర్ఘటనకు కారణమైన సదరు టిప్పర్ లారీ డ్రైవర్‌ను, బాధ్యులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి, చట్టపరంగా అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని భూక్య నవీన్ డిమాండ్ చేశారు. అదేవిధంగా,విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ఈ నిబద్ధత గల అధికారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచి పూర్తి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుడి కుటుంబానికి రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా (ఆర్థిక సహాయం) ప్రకటించాలని,దాంతో పాటు కుటుంబంలోని ఒక సభ్యుడికి అర్హతను బట్టి తక్షణమే ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. విధి నిర్వహణలో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల భద్రతను నిర్ధారించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రమాదంలో మరణించిన రవాణా అధికారి వెంకన్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,వారి కుటుంబ సభ్యులకు డివైఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి భూక్య నవీన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వర్ధన్నపేట నియోజకవర్గం సభ్యత్వ నమోదు (ఎస్ఐఆర్) ప్రత్యేక ఓటరు జాబితా సవరణ శిక్షణ లో...

**ఓటు పై భూతు బి ఎల్ ఓ లకు అవగాహన కల్పించిన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్**

**ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలం --ఓటు హక్కును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి**

**ఎస్ ఐ ఆర్ పేరుతో ఓటు హక్కులను హరించే బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి**

**ప్రతి తప్పనిసరిగా ఏనుమేరేషన్ ఫారం నింపి ఓటర్ల హక్కులను కాపాడాలి**





తెలుగు గళం న్యూస్, కాజిపేట్ జూన్ 22 :

హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం లో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన టిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్ పాల్గొని బూత్ లెవల్ ఏజెంట్లు,పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించి బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల లక్ష్యం ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకం అని అన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్ మాట్లాడుతూ.....ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేటీర్ విమర్శించారు.ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు.యస్ ఐ ర్ పేరుతో ఓటరు జాబితాల్లో మార్పులు చేసి ప్రజల ఓటు హక్కులను హరించే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతి బూత్ స్థాయి కార్యకర్త, బూత్ లెవెల్ ఏజెంట్ తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఏనుమేరేషన్ ఫారం ను తప్పనిసరిగా సక్రమంగా నింపాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి అక్రమాలు, తొలగింపులు లేదా మార్పులు జరిగినా వెంటనే స్పందించాలని సూచించారు.వచ్చే ఎన్నికల్లో కెసిఆర్ ను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కేటీర్ పిలుపునిచ్చారు.కాంగ్రెస్,బీజేపీ కుట్రలను తిప్పికొట్టి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్ కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, టి. రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి పర్వతగిరి, వర్ధన్నపేట, ఐనవోలు, హసన్ పర్తి, వరంగల్ జి ఎచ్ యం సీ పరిధిలో భూతు బిఎల్ ఓ లు, సోషల్ మీడియా కన్వీనర్ లు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట కార్యకర్తలకు ధైర్యం నింపిన కేటీఆర్- కేసులు పెట్టిన వారిని వదిలిపెట్టం'





తెలుగు గళం న్యూస్ కాజిపేట్/జూన్ 22

మోసపూరిత రేవంత్ రెడ్డి పోవాలని, 10 ఏళ్లు సురక్షిత పాలన అందించిన కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే, వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాలులో వర్ధన్నపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆరురి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిర్ ప్రక్రియ,డిజిటల్ మెంబర్షిప్, సోషల్ మీడియా శిక్షణ తరగతులకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి సుమారు 2,500 మంది కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆరురి రమేష్‌ను, కార్యకర్తలను కేటీఆర్ అభినందించారు.కాంగ్రెస్ పాలనపై విమర్శలుఇందిరమ్మ రాజ్యం వచ్చింది,ఇంటింటా సంక్షోభం తెచ్చింది'అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. పంటల కొనుగోళ్లపై రేవంత్ రెడ్డి రైతులకు మరణశాసనం రాశారని ఆరోపించారు. ఒకప్పుడు కేంద్రం చెప్తే వినడానికి 'మోడీ బ్రోకరా' అన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు మోడీ చెప్పుచేతల్లో కీలుబొమ్మగా మారారని విమర్శించారు. 'మోడీ చెప్పినంతనే పంట కొంటాం అంటున్నాడు. వచ్చే సీజన్ నుంచి రైతుల పంటలు కొనే నాథుడే ఉండడు' అని అన్నారు.రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి ఒక్క మంచి పని కూడా చేయలేదని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమం ఉంటే, కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంక్షోభంలో ఉన్నారని అన్నారు. రైతు భరోసా కింద రూ.29,350 కోట్ల బకాయిలు చెల్లించలేదని, బోనస్ కాస్తా బోగస్ అయిందని ధ్వజమెత్తారు.రైతు సమస్యలు

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి రైతులు రాత్రింబవళ్లు కాపలా పడుకొని, వడదెబ్బకు చనిపోతున్నా రేవంత్ రెడ్డికి చలనం లేదని మండిపడ్డారు. దళారులు, రైస్ మిల్లర్ల చేతిలో రేవంత్ రెడ్డి కీలుబొమ్మ అయ్యారని ఆరోపించారు. తెలంగాణ కోసం రాజీనామాలతో చరిత్ర సృష్టించి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ నాయకత్వంలో ప్రజలు, రైతులు, నిరుద్యోగుల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.వచ్చే ఎన్నికలపై ధీమా

'బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా రాదంటున్న రేవంత్ రెడ్డి, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పాలకపక్షం అవుతుందని ఒప్పుకున్నట్లే' అని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి మోసాలను ప్రజల్లోకి కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు. 'ప్రజలు రేవంత్ రెడ్డి పోవాలి – కేసీఆర్ రావాలి అని కోరుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు, నిరుద్యోగులు 100 స్థానాల్లో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు. భూమి బద్దలైనా మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే' అని ధీమా వ్యక్తం చేశారు.కార్యకర్తలకు భరోసావచ్చే ఐదేళ్లు కార్యకర్తల అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే బాధ్యత తాను తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు.'కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో అధికారులు ఎన్ని కేసులు పెట్టారో, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎవరినీ వదిలిపెట్టం. ఉద్యోగులు రిటైర్ అయినా, ఎక్కడున్నా పట్టుకొచ్చి జైలుకు పంపిస్తాం' అని హెచ్చరించారు.ధరల పెరుగుదలపై విమర్శరేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పెట్రోల్, డీజిల్, ఎరువులు, ఆర్టీఏ చార్జీలు, మద్యం ధరలు పెరిగాయని అన్నారు. 'ఔరంగజేబు జుట్టుపై పన్ను వేసినట్లు, రేవంత్ రెడ్డి ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారు. రేవంత్ రెడ్డి 5 సంవత్సరాల పాలనను ప్రజలు 50 ఏళ్ల వరకు తిట్టుకునే పరిస్థితి ఏర్పడింది' అని విమర్శించారు.ప్రాజెక్టులపై వ్యాఖ్యలు

'రేవంత్ రెడ్డికి మాటలు ఎక్కువ, చేతలు తక్కువ.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా చేపట్టలేదు. కేసీఆర్ పాలనలో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం' అని గుర్తు చేశారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనలేని రేవంత్ రెడ్డి, టీఆర్ఎస్‌ను 'మొలకెత్తని' అంటున్నారని, అదే రైతులు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పాతాళలోకానికి తొక్కడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.

రైతుబంధుపై పోలిక

కేరళ, బీహార్, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో వందల కోట్లు ఖర్చు చేసి ప్రకటనలు ఇవ్వడానికి డబ్బులు ఉంటాయని, కానీ రైతులకు రైతు భరోసా ఇవ్వడానికి డబ్బులు లేవని రేవంత్ అంటున్నారని విమర్శించారు. 'కేసీఆర్ పాలనలో ఖరీఫ్, రబీ పంటలకు వరి నారు పోసే సమయంలోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేశాం' అని గుర్తు చేశారు.ఆరురి రమేష్ పిలుపు

మాజీ ఎమ్మెల్యే ఆరురి రమేష్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిర్ ప్రక్రియపై ప్రజలకు సరైన అవగాహన కల్పించి, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, టి. రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు సతీష్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్ బాబు, బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, లలిత యాదవ్‌తో పాటు వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తపల్లి గోరి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో "ఈగల్ ఫోర్స్ తెలంగాణ"పై అవగాహన

## మత్తు పదార్థాల వినియోగం చట్టరీత్యా నేరం,సమాచారం కోసం 1908 నెంబర్ సంప్రదించాలి-విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి

తెలుగు గళం న్యూస్ కొత్తపల్లి గోరి

యువతను,విద్యార్థి లోకాన్ని పట్టిపీడిస్తున్న మత్తు మహమ్మారిని రూపుమాపేందుకు తెలంగాణ పోలీస్ శాఖ నడుం బిగించింది.ఇందులో భాగంగా గోరుకొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో సోమవారం విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కొత్తపల్లి గోరి సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై) త్రిలోక్ నాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై,విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాలపై క్షుణ్ణంగా వివరించారు.తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన "ఈగల్ ఫోర్స్ తెలంగాణ" కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యాలు,ఉద్దేశాలను ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు వివరించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు,యువత ఆరోగ్యం, వారి ఉజ్వల భవిష్యత్తుపై పడే తీవ్ర ప్రభావం గురించి సవివరంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై త్రిలోక్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి శాపంగా మారిన గంజాయి,ఇతర ప్రమాదకరమైన మత్తు పదార్థాల సేవనం,రవాణా చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు.వాటి వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తి బంగారు భవిష్యత్తు నాశనం కావడమే కాకుండా,కుటుంబాల్లో తీరని ఆవేదన, సమాజంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.జిల్లా వ్యాప్తంగా గంజాయి సేవించడం, మత్తు పదార్థాలను అక్రమంగా నిల్వ ఉంచడం, ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి సరఫరా చేయడం వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని,కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రజలు,యువత కూడా పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.మీ పరిసరాల్లో ఎక్కడైనా డ్రగ్స్ లేదా గంజాయి విక్రయాలు, సంబంధిత అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉంటే తక్షణమే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా మొబైల్ నెంబర్ 87126 71111 కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.సమాచారం ఇచ్చిన



వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, కాబట్టి ఎలాంటి భయాందోళనలు లేకుండా చైతన్యంతో ముందుకు రావాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే చెడు అలవాట్లకు, ఆకర్షణలకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో కూడిన మంచి లక్ష్యాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుత భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంతో పాటు పోలీస్ సిబ్బంది కుమారస్వామి, కృష్ణ,అజయ్,పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏనుగల్లు ప్రైమరీ స్కూల్ లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం లో పాల్గొన్న ఏనుగల్లు గ్రామ సర్పంచ్ తౌర్రి - పద్మకుమార్ యాదవ్

తెలుగు గళం న్యూస్, పర్వతగిరి జూన్ 22 :



పర్వతగిరి మండలం ఏనుగల్లు ప్రైమరీ స్కూల్ లో బాలల తల్లిదండ్రుల గ్రామసభ సమావేశం లో ముఖ్య అతిధిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ తౌర్రి పద్మకుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి "అనుముల రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నాణ్యమైన విద్యను అందించుటకు పాఠశాలలను బలోపేతం చేయుటకు ఎంతగానో కృషిచేస్తున్నారు. ఏనుగల్లు ప్రతి ఒక్కరు మీయొక్క పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి మన బడిని మనం కాపాడుకొనుటకు సహాయ సహకారాలు అందించాలని, మరియు ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు పౌష్టిక ఆహారం, స్కూల్ బ్యాగ్, షూస్, యూనిఫామ్, టై, బెల్ట్, పెన్నులు, నోటుబుక్స్, పాఠ్యపుస్తకాలు, వాటర్ బాటిల్ తో సహా అన్ని ఉచితంగా అందిస్తుందని పిల్లలనందరిని బడిలో చేర్పించుటకు అన్నివర్గాల ప్రజలు,ప్రజా ప్రతినిధులు,వార్డుమెంబర్లు, ప్రజాసంఘాల నాయకులు,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, అంగన్ వాడి టీచర్లు, ఆశా వర్కర్లు ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ కోరారు.ఈ కార్యక్రమం లో వార్డుమెంబర్లు, పంచాయతీ సెక్రటరీ, అంగన్ వాడి టీచర్లు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ-ఎస్‌హెచ్‌వో హెచ్చరిక

తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/జూన్ 22



వరంగల్ జిల్లా:నకిలీ విత్తనాలు, గడువు ముగిసిన పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట ఎస్‌హెచ్‌వో సాయిబాబు హెచ్చరించారు.మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి విజయ్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి,నాణ్యమైన విత్తనాలనే రైతులకు విక్రయించాలని డీలర్లను ఆదేశించారు.నిబంధనలు అతిక్రమిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

# పర్వతగిరి రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ,ఏసీపీ



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 22

వరంగల్ జిల్లా:పర్వతగిరి మోడల్ స్కూల్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని డీసీపీ ఈస్ట్ జోన్,మామునూరు ఏసీపీ సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు,సంభావ్య కారణాలను విశ్లేషించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన రోడ్డు భద్రతా చర్యలు,నివారణ చర్యలపై అవసరమైన పరిశీలనలు చేశారు.

# రోడ్డు ప్రమాద మృతులకు ఎమ్మెల్యే నాగరాజు నివాళి

తెలుగు గళం న్యూస్ వరంగల్/జూన్ 22



పర్వతగిరి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురి మృతదేహాలకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎంజీఎం మార్చురీలో నివాళు లర్పించారు.ఆదివారం పర్వతగిరి మోడల్ స్కూల్ సమీపంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన పర్వతగిరికి చెందిన బుద్ధె చరణ్, సోమారానికి చెందిన వడ్లకొండ ఎల్లగౌడ్, మహ్మద్ అహ్మద్ మృతదేహాల వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుని మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అయూబ్, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, మాజీ జెడ్పీ సభ్యుడు సర్వర్, సర్పంచులు ఏర్పుల శ్రీనివాస్, జున్ను కనకయ్య,ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్,మహ్మద్ అలీ, డీలర్ బాబు, జంగిలి బాబు, జంగిలి భాస్కర్ పాల్గొన్నారు.

# పర్వతగిరి జడ్పీహెచ్ఎస్‌లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/జూన్ 22



యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని వర్ధన్నపేట ఏఎస్ఐ మనోహర్ రావు పిలుపునిచ్చారు.ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా పర్వతగిరి జడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన 'ఈగల్ ఫోర్స్' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.చదువు కన్నా సంస్కారం మిన్న: ప్రిన్సిపాల్



ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పాక రమేష్ మాట్లాడుతూ,విద్యార్థుల జీవితంలో చదువు కన్నా సంస్కారం,క్రమశిక్షణే ముఖ్యమని పేర్కొన్నారు. డ్రగ్స్, మద్యపానం, ధూమపానం లాంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా, తప్పుడు స్నేహాలతో బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవు పలికారు.'క్రమశిక్షణకు మాతృభాష మౌనం' అని, ఏకాగ్రతతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఈగల్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు రమేష్, కబీర్, శ్రావణ్ రెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.